# మెతక మనిషి

**సదాశివ్** అతిసాధారణమైన మనిషి. చక్రాల్లాంటి అతని కళ్లు, సున్నాలాటి మొహం చూస్తే 'ఇతను శుద్ధ వెర్రిబాగులవాడు' అని నుదుటిరాత రాసిన చేత్తోనే బ్రహ్మ రాసేశాడనిపిస్తుంది. అతనికి ఏదీ ఓ పట్టాన తలకెక్కదు. ఎవరైనా ఏదైనా కాస్త ముఖ్య విషయం చెప్పబోతే దాన్ని అర్థం చేసుకోవడానికి లవలేశమంతున్న అతని మెదడుమీద ఎంతో భారం పడుతుంది.

అంతకంతకీ పెద్దవయ్యే అతని కళ్లు చూసినా, ఈ బుగ్గనుండి ఆ బుగ్గకు తిరుగాడే అతని నాలిక చూసినా అతను పడే శ్రమ అర్థమవుతుంది. ఈ తతంగం చూసిన ఎదుటి మనిషి జాలిగుండె కలవాడైతే నిర్లిప్తంగా ఓ నవ్వు నవ్వి, అతనికి బోధపరిచే ప్రయత్నాన్ని కట్టిపెట్టేవాడు. ఒకవేళ ఆరంభించిన పనిని పూర్తిచేసే ఉత్తముల కోవకు చెందినవాడయితే సదాయే ఓ వెర్రినవ్వు నవ్వి కణతలు రుద్దుకుంటూ, "అంతటి తికమక విషయాలు అర్థం చేసుకోవడం నాబోటివాడివల్ల అయ్యేపనా? పోన్లెండి సార్" అంటూ అతడి ప్రయత్నాన్ని ఆపేసేవాడు.

లోకమంతా తెలివైన వాళ్లతో కిక్కిరిసిలేదు. సదా సైజు మెదడున్నవాళ్లు కూడా సంక్రమించిన ఆస్తితోనో, ఆదుకొనే ఆత్మీయులతోనో నెట్టుకొచ్చేస్తున్నారు. కానీ పాపం, సదాకి వంటలక్కగా పనిచేసే విధవతల్లి తప్ప వేరే ఆధారం ఏమీలేదు. స్థితిమంతుడైన ఓ మేనమామ ఒకడున్నాడు. కానీ అతను వీళ్లను దరిక్కూడా రానివ్వడు. రఘుకాకా అనే వేలు విడిచిన బంధువుక్కూడా ఆస్తి ఉంది. కానీ ఆయనకు మహా కర్కోటకుడనీ, కాసు విదల్చడనీ పేరుంది.

సదా కాస్త ఎదిగి రాగానే అతనికి ఏకైక దిక్కుగా ఉన్న తల్లి పెద్దల్లో కలిసిపోయింది. ఏదో చిన్నా చితకాపనులు చేసి పొట్టపోసుకోవలసిన గతి సదాకి పట్టింది. మెదడు, తదితర విషయాల్లో లోటుచేసిన మాయదారి దేవుడు అతని శరీరం విషయంలో మాత్రం చల్లని చూపు చూసేడు. గంటలకొద్దీ నిర్విరామంగా పనిచేసినా అలుపూ, సొలుపెరుగని దుక్కశరీరం అతనిది. అన్నట్టు సదాకి ఇంకో సుగుణం కూడా ఉంది. తానెక్కడినుండీ దిగిరాలేదనీ, అతి సాధారణమైన మనిషిననీ అనే ఎరిక అతనికుంది. తన తాహతుకి మించిన కోర్కెలు కోరకూడదనీ, జీవిత సౌఖ్యాలకు తను తగననీ ఖచ్చితంగా అతనికి తెలుసు.

అంతమాత్రాన అతను కలలు కూడా కనడని అర్థం కాదు. ప్రతీ యువకుడిలాగే అతనూ కలలుకనే జన్మహక్కుని ఉపయోగించుకొన్నాడు. రఘుకాకా లాగా గడియారాల షాపొకటి పెట్టి అందరినీ ఆదలిస్తూ తిరుగుతున్నట్టు పదిహేడేళ్ల వయస్సులో ఓ కల కన్నాడు. మరోసారి ఆయనలాగే ఇంటికీ, షాపుకీ కారులో తిరుగుతున్నట్టు, ఇంకోసారి అందమైన భార్య చేత్తో కాఫీ అందుకొంటున్నట్టు (ఆ కలను ఇంకా కొనసాగించేడనుకోండి) కలలు కన్నాడు. వాళ్ల పిచ్చుక గూళ్లలాటి ఇంటికెదురుగా రోడ్డు కసింటా ఉన్న భాగ్యవంతుల కాలనీలో, అరుణ అనే ఎర్రని, బుర్రని ఉంగరాల జుట్టుతో, నవ్వే కళ్లతో ఉండే అమ్మాయి షోకేసులో మిఠాయిలా సదాను ఊరిస్తూండేది. చూసి లొట్టలేయడమే గాని స్వంతం చేసుకోలేని పరిస్థితి. ఆమంటే పడిచచ్చే ఇతర కుర్రాళ్ల ద్వారా తను కాలేజీలో ఆటల్లోనూ, పాటల్లోనూ కూడా ఫస్టేనని తెలిశాక షోకేసు కూడా తనకు అందరానంత ఎత్తులో ఉందనిపించింది సదాకు.

ఓరోజు చిత్రంగా అరుణ సదా కలలోకి వచ్చేసి బహిరంగంగా చెప్పుకోలేని పనులు తనతో కలిసి

— ఎమ్బీయస్ ప్రసాద్

చాలా చేసేసింది. మర్నాడు పొద్దున్న కల గుర్తుకొచ్చి సిగ్గుతో ఎర్రబడ్డ బుగ్గల్ని సదా లెంపలేసుకొని శిక్షించేడు. తన లెవెలు మనుష్యులు ఎటువంటి కలలు కనకూడదో అతనికి బాగా తెలుసు.

సదా చదువుకూడా సరిగ్గా సాగింది కాదు. స్కూల్ ఫైనల్ పరీక్ష తప్పాడు. అతను నొచ్చుకోలేదు. తనలాంటి మందబుద్ధులు ఒకటికి నాలుగుసార్లు వెళితేగాని పాసవరని అతనికి ముందే తెలుసు. బుద్ధిగా రెండోసారి పరీక్షకి కూచున్నాడు. వినూ అనే ఓ స్నేహితుడు కొన్ని ప్రశ్నలిచ్చి బట్టీ పట్టేయమన్నాడు. మనవాడు గానుగెద్దులాగా వాటిని రాపాడించేసి, బట్టీ పట్టేశాడు. పుణ్యం పుచ్చి వాటిలో సగానికి సగం పరీక్షలో దిగిపోయేయి. దెబ్బకి పాసయిపోయేడు.

వినూ హితబోధ చేసేడు, "కాలేజీ చదువు కూడా లాగించేయ్. నేనుంటాను పక్కన. నాలుగేళ్లు కష్టపడ్డావో, జీవితమంతా సుఖపడతావు. ఈ వెధవ పిచ్చికగూళ్ల సత్రం లాటి కొంప వదిలి, దర్జాగా ఓ ఫ్లాట్‌లో ఉండొచ్చు."

ఇది వినగానే సదా కళ్లు మెరవడం, కనుబొమ్మలు పైకెగబాకడం చూసి తన సలహా వృథా కానందుకు వినూ సంతోషిస్తుండగానే ఊహాలోకంలో విహారం ముగించి సదా నేలకు దిగివచ్చేశాడు. నాలిక కాస్సేపు ఈ బుగ్గలో, కాసేపు ఆ బుగ్గలోనూ ఉంచి కళ్లనూ, కళ్లలో వెలుగునూ ఆర్పేసి, నోరు చప్పరించి, "ఇవన్నీ నా బోటివాళ్లకు కాదులే గురూ" అని తేల్చేశాడు. "నువ్వు మాత్రం బాగా చదువుకొని పైకిరా, సుఖపడు. బుద్ధిపుడితే ఓసారి నన్ను పిలిచి కాఫీపోయించు. నువ్వే నేననుకొని సంతోషిస్తాను" అన్నాడు.

అంచేత వినూ కాలేజీలో చేరగా అతను రాసిపెట్టిన అప్లికేషన్లు చేతబట్టి సదా ఉద్యోగాల కోసం వేట సాగించేడు. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం అయిందేకానీ ఎస్సెల్సీ చదివిన వాడికి ఉద్యోగాలెక్కడినుంచి వస్తాయి? చివరికి ఓ రోజున ఏమైతే అయింది రఘుకాకా ఇంటికెళ్లి కాళ్లావేళ్లా పడాల్సిందే అనిపించేసింది.

తల్లిమాట గుర్తుకొచ్చింది. 'వాడసలే దుర్వాసుడు, నోటికొచ్చినట్టు తిట్టి గెంటేస్తాడు. వెళ్లకురా నాన్నా' అని. ఉద్యోగానికి వెళ్లిన ప్రతీచోటా జరుగుతున్నదదేగా, కొత్తగా ఆయన మాత్రం ఏం జేయబోతాడు అనుకొంటూ వెళ్లాడు.

మరుసటి రోజు రఘుకాకాను చూడగానే సదాకి వణుకు పట్టుకుంది. కాకా ప్రతీ అవయవం, ప్రతీ కదలికా భీతి గొల్పేవే! చింతనిప్పుల్లాటి అతని కళ్లు చూసినా, గరుత్మంతుడి లాటి ముక్కు చూసినా, గజంబద్ధ మింగేసినట్టు కూచునే తీరు చూసినా – భృకుటి దగ్గర ముడివేసిన కనుబొమలు చూసినా, ముఖంమీద అసంఖ్యాకంగా గీసిన గీతలు చూసినా, వీటిలో ఏ ఒకటి చూసినా చాలు అవతలివాడు దడదడలాడటానికి. సదాలాటి వాడైతే చెప్పనే అక్కర్లేదు. సదాని చూడగానే రఘుకాకాకు ఒళ్లు మండుకొచ్చింది, వచ్చి తన టైము వృథా చేస్తున్నాడని. తన్ని తగిలేయబోయేడు కానీ చేతులు కట్టుకొని, తలకాయ దించుకొని నుంచున్నవాడిని అంత త్వరగా ఏమీ చేయలేం కదా!

కానీ గుర్రుమన్నాడు, "ఎవరయ్యా నువ్వు? ఎక్కడో చూసినట్టుందే?"

సదా పెదాలు తడుపుకొని "నా పేరు సదాశివ్ అంటారండి. భాగీరధమ్మ కొడుకుని"

కాకా కనుబొమలు పీటముడి పడిపోయి, "అలా చెప్పు. దూరపు బంధుత్వం పేరు ఎప్పి, ఏవో శోకగాథలు వినిపించి నొల్లుకుపోదామని ఒచ్చివుంటావ్. ఈ పప్పులు నా దగ్గిర ఉడకవ్! రాగిదమ్మిడీ ఇచ్చేది లేదు. నంగిరి పింగిరి వేషాలు కట్టిపెట్టి వచ్చిన దారిపట్టు" అంటూ అందుకొనేసరికి సదా బిత్తరపోయి నోరు పెగల్చలేకపోయాడు.

దాంతో కాకాకు చిరాకు ఇంకా పెరిగింది. "నీ ఏడుపు కథేదో త్వరగా చెప్పేడు. అవతల నాకు టైమవుతోంది" అంటూ అరిచేడు. సదాకు భయం ముంచుకొచ్చింది. మాటలు తోసుకొచ్చేయి. "ఊ... ఉద్యోగం కావాలి నాకు"

రఘుకాకా శివమెత్తిపోయేడు. "ఉద్యోగం కావాలా? అవేమైనా చెట్లకు కాస్తున్నాయా? నేనిక్కడ

నోముపట్టి ఉద్యోగ దానాలు చేస్తున్నాననుకొన్నావా?" అంటూ లంకించుకొన్నాడు. సదా సమాధానం చెప్పలేదు. 'ఎందుకు వచ్చానురా భగవంతుడా?' అనిపించేసింది. అతనికి ఉన్నట్టుండి మాయమయిపోతే బాగుణ్ణు అనుకొన్నాడు. కానీ అతని దుర్భర పరిస్థితి అతణ్ణి పలికించింది. "నేను ఏ... ఏ పనైనా చేస్తాను. ఏదైనా సరే... ఏదైనా"

కాకా వాక్ప్రవాహానికి గండిపడింది. వెటకారం మేళవించి, "ఏదైనా సరే చేస్తావా? అయితే ఈ గదులూ ఆ పావంచాలూ తుడవమన్నాననుకో..?" అనబోయేడు.

"ఓ తప్పకుండా" అన్నాడు సదా మారు ఆలోచన లేకుండా.

"అయితే ఆ మూలనున్న చీపురు తీసిచూడు, చూద్దాం"

సదా సంకోచపడలేదు. బిడియపడలేదు. ఇదేం మనకు కొత్తపనా? పనిమనిషి లేకపోవడంవల్ల చిన్నప్పణ్ణుంచీ ఇంట్లో చేసుకొనేదే ఇవాళ వీళ్లింట్లో చేస్తున్నాం. తప్పేముంది? అనుకొని శుభ్రంగా తుడిచేశాడు.

ఈసారి బిత్తరపోవడం కాకా వంతయింది. అయినా వదిలిపెట్టదలచుకోలేదు. "ఈ పెట్టె నెత్తినెట్టుకొని స్టోర్‌రూమ్‌కి పట్టుకెళ్లు" అన్నాడు. 'మావూరి ఓడ ఎక్కినప్పుడు నేను చేసే పనేగా ఇది' అనుకొంటూ సదా నిస్సంకోచంగా పెట్టె నెత్తికెత్తుకున్నాడు.

మనసులో మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు కాకా. ఎదురు ప్రశ్నలూ, వెధవ సందేహాలు లేకుండా చెప్పిన పని పుచ్చుకుక్కలా చేసే పనివాళ్లను అతగాడు చూసి చాలా ఏళ్లయింది. బ్రహ్మదేవుడు అలాటివారి తయారీ మానేసేడేమోననుకొనే రోజుల్లో ఇలాంటి నంబికొండయ్యలాటి వ్యక్తిని ఎవరొదులుకుంటాడు? మొహంమీద చిరాకు ముద్ర నలాగే ఉంచి, "సరేలే, రేప్పొద్దున ఏడుగంటలకొకసారి కనపడు. ఏదైనా పనుందేమో చూద్దాం. ఏడంటే ఏడే సుమా. ఒక్క నిమిషం ఆలస్యమయిందో, అంతే..."

ఆవిధంగా రఘుకాకా వాచీల దుకాణంలో సదాకు పని దొరికింది. కొద్ది కాలంలోనే ఇతను రాని క్రితం పనులెలా గడిచేవిరా అని ఆశ్చర్యపడేటంతగా ఆ దుకాణంతో అతను మమేకం అయిపోయేడు.

సాధారణంగా కాకా దుకాణంలో పనివాళ్లు చేరేవాళ్లు చేరుతుంటారు, జారుకొనేవాళ్లు జారుకొంటుంటారు. పనిలో చేరిన నాలుగు రోజులలోనే కాకాతో వేగలేక దండంపెట్టి పారిపోయేవారు. సదా మాత్రం తిట్టినా, తిమ్మినా, కొడతానన్నా, కోస్తానన్నా కొట్టునే నమ్ముకొని ఉండిపోయేడు.

ఎవరైనా, ఇదేమిటోయ్ బొత్తిగా అంటే 'నాబోటి చవటలకు ఇంతకన్నా రాజోద్యోగం దొరుకుతుందా? ఒకవేళ ఎవడైనా ఇచ్చినా రెండోరోజు ఇంటికి పంపిస్తాడు. నోటి దురుసుంటేనేం, కాకా జీతం సరిగ్గా ఇస్తాడు. ఇక తిట్లంటారా? విని, విని అలవాటు పడిపోయేను. అవి నన్ను బాధించవు" అనేవాడు.

దానా దీనా కొద్ది సంవత్సరాల్లోనే సదా అందరికంటే సీనియర్ పనివాడు అయిపోయేడు. ఉపకార స్వభావంతో అందరి పనుల్లో చేదోడు వాదోడుగా ఉండటంతో అన్ని శాఖల్లో పనీ పట్టుబడింది. అందరికీ తలలో నాలుకగా ఉండటం వలన కొలీగ్స్‌కి అతనంటే ఇష్టం ఏర్పడింది. కస్టమర్లకు అతను మరీ బాగా నచ్చేడు. దానివల్ల వ్యాపారమూ పెరిగింది.

రఘుకాకా షాపుకి మంచిపేరుంది. నాణ్యమైన వస్తువులు అమ్ముతాడనీ, రిపేరింగు కూడా బాగా చేస్తాడనీ... అందులోనూ రిపేరు చేసే జాతిలో తప్పబుట్టినట్లు అన్న టైముకి ఇచ్చేస్తాడు కూడానూ. వచ్చిన చిక్కల్లా కట్టె విరిచినట్లు మాట్లాడే కాకా అలవాటుతోనే. తెలియకో, తక్కినచోట్ల అలవాటు కొద్దో ఎవరైనా బేరమాడబోతే ముఖం బద్దలు కొట్టినట్టు 'మీకిష్టమైతే తీసుకోండి, లేకపోతే వదిలి పెట్టి వెళ్లండి. బేరమాడాలని అంత సరదాగా ఉంటే, వేరేచోటికెళ్లండి' అనేసేవాడు.

అతని షాపుకున్న పేరు ప్రఖ్యాతులు చూసి రిపేరు కోసం చాలా వాచీలే వచ్చేవి. రద్దీవల్ల రిపేరింగుకు వచ్చినవి పది, పదిహేను రోజుల తర్వాత తిరిగి ఇచ్చేవాడు. ఎవరైనా 'కాస్త ముందు ఇవ్వలేరా?' అని అడిగితే కాకా వల్లకాదు అంటూ దురుసుగా వాచీ వెనక్కిచ్చేసేవాడు. ఏదో నోరుజారి

అన్నాను రిపేరింగుకి తీసుకో బాబూ అని కస్టమరు బతిమాలేదాకా పని ఒప్పుకొనేవాడు కాదు. ఈ ధోరణి నచ్చక కొంతమంది రావడం మానుకొన్నారు కూడాను.

అయితే సదా ఆ కౌంటరు చూసుకోవడం మొదలెట్టిన దగ్గర్నుంచీ పరిస్థితి మారింది. కాకా చెప్పిన జవాబులే సదా కూడా చెప్పేవాడు. మెత్తగా, ప్రాధేయపడుతున్నట్లు చెప్పేవాడు. అదీ తేడా! పెరుగుతున్న ధరల గురించి, రిపేరింగులో ఆలస్యానికి కారణాల గురించి ఎంత వివరంగా చెప్పుకొచ్చేవాడంటే కస్టమర్లు కరిగిపోయి, "మీ చిత్తం వచ్చిన రేటుకే, చిత్తమొచ్చినప్పుడే ఇవ్వండి నాయనా' అనేసేవారు. అప్పుడిక 'మీలా ఇతరుల ఇబ్బందులను అర్థం చేసుకొనేవాళ్లు ఎంతమంది ఉంటారు చెప్పండి' అంటూ సదా స్తోత్రపారం మొదలెట్టేవాడు.

వ్యాపార విషయాలు మాత్రమే కాదు, మిగతా విషయాల గురించి మాట్లాడడానికి కూడా సదా రెడీగా ఉండేవాడు. కూరగాయల ధరవరలు, కూతుళ్లకివ్వాల్సిన కట్నకానుకలు, విడాకుల కోసం ఎగబడే యువజంటలు, వైజయంతిమాల పుట్టుసొగసులు, పెట్టుసొగసుల మధ్య తేడాలు – వీటి గురించి తమ అభిప్రాయాల్ని ఉద్ఘాటించదలచుకొన్న కస్టమర్లను వాగనిచ్చేవాడు, తనూ వాగేవాడు.

దాంతో కౌంటర్ వద్ద పని మందగించేది. అయినా కస్టమర్లు నొచ్చుకొనేవారు కాదు. రఘుకాకాకు మాత్రం చిరాకేసేది. కబుర్లు కట్టిపెట్టి పనిచూడమని సదాను హెచ్చరించేవాడు. అక్షింతలు పడగానే నాలిక్కరుచుకొని సదా నోటికి తాళం వేసేవాడు. కస్టమరుకి ఇదంతా వేడుకగా ఉండేది. నవ్వుకొంటూ వెళ్లిపోయేవాడు.

సదా వాగుడు కాకాకు ఎంత విసుగు పుట్టించిందంటే కొన్ని రోజులకి అతన్ని ఆ కౌంటర్ నుండి తప్పించేసి తనే కస్టమర్లతో వ్యవహరించసాగాడు. మళ్లీ అరుపులూ, వాదోపవాదాలు పునర్దర్శనమిచ్చేయి. కస్టమర్లు విసుక్కుంటూ వెళ్లిపోయేవారు. కొంతమంది సదా ఎక్కడ అతనితో పనుంది అనేవారు. కాకాకు ఒళ్లుమండుకొచ్చి తిక్క పుట్టుకొచ్చి కస్టమర్లను చూడడం మానేసి ఆ పని సదాకు ధారాదత్తం చేసేశాడు. చేసేముందు కస్టమర్లను నెత్తికెక్కించుకొన్నందుకు సదాను బాగా తిట్టిపోశాడు. సదా నాలిక్కరుచుకొని తప్పంతా తనదేనంటూ ఒప్పుకున్నాడు.

సదాకు జీవితం తృప్తికరంగానే ఉండేది. కాకా చెప్పినంతసేపూ గొడ్డులా చాకిరీ చేసేవాడు. తిట్టినా కిమ్మనేవాడు కాదు. జీతం ఎంతిస్తే అంత పుచ్చుకొనేవాడు. తన సత్తా తనకు తెలుసు కాబట్టి ఇంతకంటే ఎక్కువ జీతానికి తను తగననుకొనేవాడు. గుట్టుగా సంసారం నెట్టుకొచ్చేవాడు. అందువల్ల తనతో పనిచేసే మెకానిక్ ఒకతను జీతం గురించి ప్రస్తావించినప్పుడు ఆశ్చర్యపడ్డాడు.

ఆ మెకానిక్ వాచీలు రిపేరు చేయడంలో నేర్పు ఉన్నవాడు, ఆ నేర్పు ఉందని ఎరిక గలిగినవాడు. దాంతో కించిత్తు పొగరూ, తగినంత గుర్తింపు రాలేదన్న వగపూ కలవాడు. తక్కినవారందరిలాగే అతనికీ సదా అంటే ఇష్టం. ఓ రోజు ఇరానీ టీ స్టాల్లో టీ తాగుతూ కదలేశాడు.

"సదా బాబూ, మీ జీతం ఎంత?"

సదా ఆశ్చర్యపడ్డాడు. "ఏం అలా అడిగేవ్? రెండొందలు ఇస్తార్లే. ఏదో నా ఒంటికాయ సొంటికొమ్ము బతుక్కి అదే ఎక్కీతొక్కీ"

"సిగ్గు లేకపోతేసరి. నెలకు నాలుగైదు వేలు షాపుమీద సంపాదిస్తూన్న షావుకారు నాకూ, నీకూ ఇచ్చేది రెండొందలు, మూడొందలూ. నిజానికి షాపు నడిచేదే మీ బోటి, నా బోటి నిజాయితీపరులైన వర్కర్లవల్లే కదా"

ఆ ధోరణి ఆలోచనలు సదాకెప్పుడూ రాలేదు. అందువల్ల మొదటిసారి వినగానే సదా గుక్క తిప్పుకోలేకపోయాడు. "నిజంగానా? నువ్వు చెప్పేదంతా నిజమే?" అంటూ నోరు వెళ్లబెట్టాడు. ఆశ్చర్యంతో అతని కనుగుడ్లు బయటకు వచ్చేశాయి.

కుర్ర మెకానిక్ పుంజుకొన్నారు. "పదహారణాల నిజం! నేను చెప్పేది సింపుల్. ఆ డబ్బంతా మనవల్లే వస్తున్నప్పుడు దాంట్లో ముప్పాతిక పాలు షావుకారు ఎదాన ఎందుకు పోయాలి? మనమే ఓ

షాపు పెడదాం. నువ్వు కస్టమర్ల సంగతి చూడు. రిపేర్ల సంగతి నేను చూసుకొంటా. లెక్కేసి చూశా. సంవత్సరంలో మన పెట్టుబడి వెనక్కి రావడమే కాదు. ఆ తర్వాత నెలకు తలా రెండువేలు సంపాదిస్తాం"

రెండువేలు సదా నోరూరించేయి. కళ్లు మెరిశాయి. "అమ్మయ్యో, రెండువేలే, బోల్డంత డబ్బు రాజాలా బతకొచ్చు. ఏవంటావ్? కారు కూడా కొనచ్చు, ఏమంటావ్? తాజ్‌మహల్ హొటల్‌కెళ్లి కడుపు పట్టినంత తినొచ్చు, ఏవంటావ్?"

కుర్ర మెకానిక్ మురిపెంగా నవ్వేడు. "అంతకంటే చాలా పనులు చెయ్యచ్చు. తాజ్‌లో భోజనం ఓ లెక్కకాదు. మీకూ నా అయిడియా నచ్చినట్టుగానే ఉంది. మనమిద్దరమూ వాటాదార్లుగా కొట్టు పెడదామా?"

"బ్రహ్మాండంగా ఉంటుంది" అన్నాడు సదా పొంగిపోతూ.

"మరి మాట కరారేనా?" అంటూ షేక్‌హేండు ఇవ్వడానికి మెకానిక్కు చేయిచాపేడు.

అంత హఠాత్తుగా నిర్ణయాలు తీసుకోవడం అలవాటు లేని సదా గాభరాపడిపోయాడు. మనసులోనే గందరగోళపడిపోయి, నాలికను ఆ బుగ్గకూ, ఈ బుగ్గకూ కాస్సేపు తిప్పాడు. కళ్లలో మెరుపూ, మొగంమీద నగవూ ఇగిరిపోయాయి.

ఎప్పటిలాగానే వెర్రివాలకం వేసుకొని, "వద్దులే గురూ, నేను లాభంలేదు.. అలాంటివాటిలో నా సత్తా నాకు తెలుసుగా. రఘుకాకా కొట్లో చాకిరీ, చీకటి గుయ్యారపు ఇంట్లో కాపురం... ఇవే నా మొహాన రాసున్నాయి"

కుర్ర మెకానిక్‌కు ఆశ్చర్యం. చిరాకూ, కోపం అన్నీ వచ్చేశాయి – "అదే మీ ఉద్దేశ్యమయితే, నేను అయిడియా చెప్పినప్పుడు ఎగిరి గంతేయడమెందుకు?" అని నిలదీశాడు.

సదా చప్పబడిపోయి, క్షమాపణలు మొదలెట్టేడు. "కోపం తెచ్చుకోకు గురూ, నిజానికి నీ ప్లాను నాకెంతో నచ్చింది. నిజంగా అర్హత ఉంటే దాంట్లో చేరివుండేవాణ్ణే. కానీ ఏం చెయ్యను? పనికిమాలినవాణ్ణి. అవన్నీ నా వల్లకావు. నా మాటవిని నువ్వు మాత్రం ఈ దిక్కుమాలిన ఉద్యోగం వదిలేసి కొట్టుపెట్టుకొని బాగుపడు. నాలాటివాణ్ణి కాకుండా, నీలాటి చాకులాటివాణ్ణి భాగస్తుడిగా పెట్టుకో. నువ్వు తప్పకుండా పైకొస్తావ్. ఓ బంగళా, కారు అమర్చుకొంటావ్. నాకు తెలుసు. నువ్వు కారుకొన్నాక, నన్ను మర్చిపోకుండా ఓసారి కార్లో జుహూ బీచికి తీసుకెళ్లి ఓ గంగాబోండం ఇప్పించు, నా కదే చాలు"

కుర్రమెకానిక్‌కు ఒళ్లు మండి లేచిపోయేడు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి, ఇంకొక ఇద్దరితో చేరి దుకాణం తెరిచాడు. అయితే సదాశయాలతో ఆరంభించే అనేక పథకాలలాగే ఇదీ ఆచరణలో చీదేసింది. పార్ట్‌నర్లు కొట్టుకున్నారు, విడిపోయేరు, షాపు మూతబడింది. కుర్ర మెకానిక్ కష్టపడి దాచుకొన్నది ఊచ్చుకుపోయింది. వేరేచోట నౌకరీకి కుదిరేడు.

సదా మాత్రం అదే అరవచాకిరీ చేస్తూ, ముక్కచివాట్లు తింటూ ఆ రెండువందల రూపాయిలతోటే నెట్టుకొస్తున్నాడు.

రఘుకాకా షాపుకి సోమవారం సెలవు. కాకాను ఆ రోజు కూడా భరించడానికి సమ్మతించే పనివాడెవడైనా ఉన్నాడంటే అతను సదా ఒక్కడే. ఆవేళ వాళ్ల ఇంటికెళ్లి అతను చెప్పిన ఇంటిపనులు చేసిపెట్టడం తన డ్యూటీలో భాగంగా తలచేవాడతను. కాకా భార్య పోయింది. కొడుకు పేరున్న సర్జన్. దోసిళ్లకొద్దీ ఆర్జించేవాడు. అతను తండ్రికీ, తండ్రి వ్యాపారానికీ ఎప్పుడూ దూరంగానే ఉండేవాడు. నిజానికి ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకొనేదే అరుదు. ఇల్లు నిర్వహణంతా కోడలిదే. మంచి తెలివైనదీ, ఓపికమంతురాలు కూడా.

ఆ సోమవారం సదా వెళ్లేటప్పటికి బాగా ఇంట్లో వాతావరణం గంభీరంగా ఉంది. రఘుకాకా కుర్చీలో నిటారుగా కూర్చుని కోపాన్ని దిగమింగుకొని కూచున్నట్టున్నాడు. కోడలు బట్టలూ, అవీ సద్దుతోంది. ఆమె ప్యాకింగ్ ఎప్పుడూ పూర్తవుతుందాని కొడుకు అసహనంగా కాచుకొని ఉన్నాడు.

సదాకి మతిపోయింది, సంగతేమిటని ఎవర్ని అడగాలన్నా ధైర్యం చాలలేదు. కాకాని పలకరిస్తే

కస్సుమసేట్టున్నాడు. మామూలుగా యోగక్షేమాలడిగే కోడలు కన్నెత్తి కూడా చూడలేదు. కొడుకు కాస్త మెరుగ్గా ఉన్నాడు. బెరుగ్గా అతని దగ్గరజేరి, "ఊరెడుతున్నారా?" అని అడిగేడు. కొడుకు ఓ చూపు పారేసి అతని వెన్నుతట్టి ఊరుకున్నాడు.

కోడలు ప్యాకింగ్ పూర్తయింది. సామాను బయటకు తీసుకెళ్లమని పనివాడితో చెప్పి మొగుడితో కలిసి మామగారి పాదాలు మొక్కబోయింది. కాకా ఛట్టున కాళ్లు వెనక్కి లాక్కున్నాడు. "చాలించండి. ఈ వినయాలు! పోతేపొండి. ఓసారి బయటకు అడుగుపెడితే తిరిగి ఇంట్లోకి రానిచ్చేది లేదని గుర్తుపెట్టుకొని మరీ కదలండి. జన్మలో మీ మొహం చూసేది లేదింక" అంటూ అరిచేడు.

కోడలి ఓర్పు హరించుకుపోయినట్టుంది. ముఖం చిట్లించుకొంది. కొడుకు నిట్టూర్చి, ఆమెను లేవదీసి గుమ్మంవైపుకు నడిపించేడు.

స్థాణువులా ఉండిపోయిన సదాకి హఠాత్తుగా మెలకువ వచ్చినట్టు పరిగెట్టుకుంటూ వెళ్లి వాళ్ల దారిలో అడ్డుపడ్డాడు, "వద్దొద్దు, వెళ్లొద్దు" అంటూ.

కాకా మండిపడ్డాడు. "ఈ వ్యవహారంలో తలదూర్చేవో, నిన్నూ మెడపట్టి గెంటుతా జాగ్రత్త" అంటూ.

కొడుకు, కోడలూ తలుపుమూసి వెళ్లిపోయారు. కాకా పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ గదిలో నుండి వెళ్లిపోయేడు. సదాకి ఏం చెయ్యాలో తోచక నెమ్మదిగా జారుకొన్నాడు.

కొడుకు, కోడలూ బ్రతిమాలకుండా వెళ్లిపోవడంతో కాకా అది పెద్ద అవమానంగా భావించాడు. ఉక్రోషంతో మరింత కోపిష్టిగా తయారయి కనబడిన వాళ్లందరినీ కాల్చుకు తినేవాడు. ఇంట్లో పనివాళ్లూ, దుకాణంలో పనివాళ్లూ మహా అవస్థపడుతూండేవారు. సదాలాంటి మెతకవాడు కూడా భరించలేని స్థితి వచ్చింది.

దీనివల్ల జరిగిన పరిణామం ఏమిటంటే షాపు కార్మికులు ఒక యూనియన్‌గా ఏర్పడడం, ఓ శుభ ముహూర్తాన సమ్మెకు దిగడం. సదా మాత్రం యూనియన్లో చేరలేదు. సమ్మె రోజున దుకాణంలోకి వెళ్లనిమ్మని లీడర్లని బతిమాలుకొన్నాడు. కానీ జండాలు పట్టుకొని నినాదాలిస్తున్న కార్మికులు ఒప్పుకోలేదు.

ఈ గోలంతా చూసి రఘుకాకా రెచ్చిపోయాడు. వెళ్లి షాపు తెరవమని పనివాళ్లని అదిలించేడు. కానీ వాళ్లు వినందే! కాకాకు కాక పుట్టి, తలుపులు తనే తీసి, గుమ్మంలో నుంచుని అందర్నీ తిట్టిపోసేడు. పనివాళ్లు నినాదాల జోరు పెంచేరు. కాకా గొంతు చించుకొంటున్నాడు. కానీ అతని మాట అతనికే వినబడని పరిస్థితి వచ్చిపడింది.

అప్పుడు యూనియన్ లీడరు రంగంలోకి దిగేడు. రఘుకాకాను నెట్టుకొంటూ లోపలికి వెళ్లి, బ్రీఫ్‌కేస్ తెరిచి కోర్కెల చిర్తా బయటకు తీసి చదవనారంభించేడు. కాకా ఆక్షేపణలను పట్టించుకోకుండా కంచుకంఠంతో చదువుకుపోసాగేడు. కాకా ఇక వాదనకు దిగేడు. కానీ కోపంతో మూర్ఛ వచ్చినంత పనయింది. "ఈ గొంతెమ్మ కోర్కెలు తీర్చే బదులు, ఈ కొట్టుకి అగ్గెట్టేసి, ఇంట్లో కూచోడం మేలు" అని అరుచుకుంటూ కొట్టు మూసేసి, కోపంతో వణికిపోతూ కారెక్కేశాడు.

సమ్మెచేసే పనివాళ్లు అతన్ని హేళన చేసి కేరింతలు కొట్టేరు. కానీ తర్వాత ఏం చెయ్యాలో తెలిసింది కాదు. షట్టర్లు మూసేసిన కొట్టుముందు కేకలేస్తే అరణ్యరోదన అవుతుంది కదా! కేకలు చాలించి ఎవళ్లింటికి వాళ్లు వెళ్లేరు.

సదాకు చచ్చే భయం వేసింది. కాకాకు ఏమయిందోనని బెంగ పట్టుకొంది. అతని వెనకాలే కాకా ఇంటికి వెళ్లాడు. ఎప్పటిలాగానే రఘుకాకా కొయ్యమేకులా కూర్చుని ఉన్నాడు. సదాని చూడగానే రక్తం తలకు పొంగుకొచ్చింది. "ఫో, పో నువ్వూ ఆ విశ్వాసఘాతకుల్లో ఒకడివే టక్కరి వెధవా! ముందిక్కణ్ణుంచి ఫో' అని అరుస్తూ కోపంతో ఊగిపోతూ లేచి నుంచుని, అంతలోనే దబ్బున పడిపోయేడు. సదా పరిగెట్టుకెళ్లి పట్టుకొని జాగ్రత్తగా మంచం మీదకు చేర్చాడు. ఫ్యామిలీ డాక్టరుకు, కాకా కొడుక్కీ ఫోన్లు చేశాడు. డాక్టరొచ్చి 'హార్టు ఎటాక్' అని చెప్పి జాగ్రత్తగా చూసుకోవాలని మరీ మరీ చెప్పి వెళ్లాడు.

రఘుకాకా కోడలు వాహిని బాధ్యత వహించి, మామగార్ని హాస్పిటల్లో చేర్పించి నర్సులను ఏర్పాటు చేసింది. కానీ తనూ, భర్తా మావగారిని చూడబోయినప్పుడు కాకా వాళ్లమీద అరవడం మొదలుపెట్టాడు. తక్షణం ఇద్దరూ బయటకు వచ్చేశారు. కొడుకు సదాను పక్కకు పిల్చి "మేం వెళ్లి చూసినా, చుట్టుపక్కలున్నా ముసలాయన పరిస్థితి క్షీణిస్తుంది కానీ మెరుగుపడదు. నువ్వే దగ్గరుండి వ్యవహారం నడిపించు. ఖర్చుకు వెనకాడకు. నేను భరిస్తాను" అన్నాడు.

సదాలాటి సాదామనిషి తన ఆలనా పాలనా చూడడం రఘుకాకాకు సుతరామూ ఇష్టంలేదు. అందులోనూ ఆయన తన అభిప్రాయాలు దాచుకొనే మనిషి కూడా కాదాయె. అవన్నీ విని కూడా సదా నోర్మూసుకొని పడివుండేవాడు. అతనిచేత సపర్యలు చేయించుకోక ముసలాయనకు తప్పేదికాదు. దాంతో ఉడుకుమోత్తనం పెరిగి, 'నీ ఆషాఢభూతి వ్యవహారం నాకు తెలీదనుకోకు. నన్ను ఎలాగైనా ఉబ్బేసి ఆ షాపూ, ఇల్లూ నీపేర రాయించేసుకొందామని నీ ఎత్తుగడ. అందుకే ఇంతంత సేవలూ, ప్రేమ కారిపోతున్నట్టు నటించడాలూనూ' అంటూ విరుచుకుపడేవాడు. ఇంత దారుణమైన ఆరోపణలకు జవాబు ఎలా చెప్పాలో తెలియక సదా ఏమీ బదులు పలికేవాడు కాదు.

రోజూ కొడుకు ఇంటికెళ్లి కాకా యోగక్షేమాల కబురు చెప్పేవాడు. కోడలు కూడా వింటూండేది. ఓ నెల్లాళ్లు పోయేక ఆవిడ వెటకారంగా నవ్వుతూ, "చూస్తూండండి, మావగారు పైకి ఏమంటున్నా సరే, ఆస్తీ పాస్తీ సదాబాబుకి రాసేస్తారు" అంది.

ఈ మాట వినగానే సదా హడలిపోయేడు. "మీ కసలు అలాటి ఊహలెక్కణ్ణుంచి వస్తాయో తెలీదు. నాకు ఎర్ర ఏగానీ ఇచ్చేదిలేదని రోజుకి పదిసార్లు కాకా అరుస్తూంటారు. దానధర్మాలకే అంతా ఇచ్చేస్తారట్ట. నన్నడిగితే అదే మంచిది. నా బోటివాడికి ఇస్తే నేనేం చేసుకోగలను? ఆ షాపు నడపడం నా వల్ల అయ్యేపనా?"

కొన్ని రోజులకి మరొక హార్టు ఎటాక్ వచ్చి కాకా ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయేయి. పోతూ ఇల్లూ, షాపూ, ఇంకొంత ఆస్తీ సదాకు, తక్కినవి దానధర్మాల కింద రాసేశాడు. దినాలు అయ్యేక వకీలు విల్లు చదివినప్పుడు, సదా ఉక్కిరి బిక్కిరయిపోయేడు. ఇంకొకరి ఆస్తి తాను కాజేసినట్టు ఫీలయ్యేడు.

కోపం, రోషం కలిసిన గొంతుతో కోడలు, "చూశారా, నేను చెప్పినట్టే అయింది. సదాబాబు దేవాంతకుడు. పైచూపుల్ని బట్టి మోసపోకూడదు" అనేసింది.

సదా ఆమె దగ్గరకు పరిగెత్తుకెళ్లి చేతులు జోడించి, "అమ్మా, అలాటి మాటలనకు. నాకు ఈ ఆస్తీ పద్దు ఏమీ వద్దు. ఇదంతా మీ సొత్తు. ఇలా జరుగుతుందని నాకెన్నడూ తెలీదు" అంటూ ప్రాధేయపడ్డాడు.

"వట్టి కబుర్లెందుకులెండి. మీ గంగిగోవు మొహం చూసి మోసపోయే రోజులు చెల్లిపోయాయి. అనుభవించండి. ముసలాయన్ని కాకా పట్టి సంపాదించుకొన్నది తనివితీరా అనుభవించండి. మాకేమీ మీ దయాధర్మ బిచ్చం అక్కర్లేదు"

సదాకు ఏం చెయ్యాలో తెలియలేదు. చేతులు కట్టుకొని, తలవాల్చేసి దోషిలా నుంచున్నాడు.

రఘుకాకా కొడుకు అతని పరకాయించి కాస్సేపు చూసి భార్యతో "ఇతనిమీద అరవడంలో అర్థంలేదు వాహినీ. అతను ఇందులో చేసినదేముంది? సదాబాబూ, నేనే కావలసినంత సంపాదించుకొంటున్నాను. నాకు ఇద్దామని మా నాన్నకు అనిపించనప్పుడు, ఆ ఆస్తి నాకెందుకు? నువ్వు తీసుకుని సుఖపడు" అన్నాడు.

దీనితో సదా ఇంకా వణికిపోయేడు. "నేను చెప్పేది మీకు కూడా అర్థం కాలేదా బాబూ? అంత పేరు ప్రఖ్యాతులున్న షాపుని నా చేతుల్లో తీసుకొని నడపడం నా చేతనవుతుందనుకొంటున్నారా? కారులో తిరుగుతూ, ఆ షాపులో షావుకారిగారి సీట్లో నేను కూచుంటే జనాలు నా మొహంమీదే నవ్వుతారు. 'కనకపు సింహాసనమున శునకం ఎక్కిందిరా' అంటారు. షాపు మీరే తీసుకొని నడపండి"

కొడుకు పగలబడి నవ్వేడు. "వాచీల గురించి నాకేమైనా తెలుసా పెట్టా? క్లినిక్ మూసేసి ఆ

షాపులో నే కూర్చోవాలని నీ అభిప్రాయమా? నువ్వైతే ఆ షాపులో ఏళ్ల తరబడి పనిచేసి నాలుగు విషయాలూ తెలుసుకొన్నావు. నువ్వే నడపగలవు"

"అబ్బే, అలాక్కాదు..." అంటూ సదా మళ్లీ ఆరంభించబోయేసరికి "ఇక వాదనలు వద్దు, షాపు సంగతి నువ్వు చూసుకోవాల్సిందే" అని కొడుకు ఖరాఖండీగా చెప్పేశాడు. క్లినిక్‌లో అతని గురించి పేషెంట్లు కాచుకొని ఉన్నారు.

సదా కోడలికేసి తిరిగి, "వాహినీ, నువ్వు కలగజేసుకొని, నన్ను గట్టున పడేయాలమ్మా" అన్నాడు.కోడలు చదువుకొన్నదీ, సమర్థురాలు. కళ్లెదురుగుండా ఆస్తి చేజారిపోతుండటం ఆమెకు కంటకంగా ఉంది. "సదాబాబూ, మీరు చెప్పేది ఉత్తుత్తిమాటలా? మనసులోంచి వచ్చేవా?" అని నిష్కర్షగా అడిగింది.

"మనస్ఫూర్తిగా చెప్తున్నానమ్మా, లాయరు గారిచే రాతకోతలు రాయించండి" అన్నాడు తననీభారం నుంచి ఈమైనా విముక్తి చేస్తుందేమోనన్న ఆశతో.

సదా చిత్తశుద్ధిపై కోడలుకు నమ్మకం చిక్కింది. "సరే అలా అయితే షాపు నేను చూస్తాను. కానీ రోజూ వచ్చి కొట్లో కూచోవడం నాకు కుదరదు. అదంతా నువ్వే చూసుకోవాలి"

'హమ్మయ్య' అనుకొన్నాడు. అనుకొని వంగి ఆమె పాదాలు స్పృశించాడు. సదా మనసులో కల్మషంలేదనీ, పరులసొత్తుకి ఆశపడే రకం కాదనీ కోడలికి గురి కుదిరింది. అతన్ని అనుమానించినందుకు సిగ్గుపడింది. ఆమెలోని సహజ ఔదార్యం పైకి తన్నుకువచ్చింది. "కానీ మా మావగారి ఇల్లూ, కారూ నువ్వే అట్టిపెట్టుకో. మాకు నచ్చినవిధంగా మేం ఇంకో ఇల్లు కట్టుకొన్నాం. దాంట్లోనే ఉంటాం. ఆయన లంకంత కొంప నాకెప్పుడూ ఇష్టం ఉండేదికాదు." అంది.

ఆవిధంగా సదాకు కావలసిన విధంగానే అన్నీ జరిగేయి. కోడలు చాకచక్యంగా వ్యవహరించి కార్మికులచేత సమ్మె మానిపించి షాపు తెరిపించింది. సదా ఎప్పటిలాగానే కౌంటర్లో నిలబడి కస్టమర్లతో కబుర్లాడుతూ పని జరిపిస్తున్నాడు. డబ్బు అజమాయిషీ అంతా కోడలిదే. తనతోబాటు పనిచేసినవాడిని యజమానిగా అంగీకరించడానికి పనివాళ్లకు కొంతకాలం పట్టింది. కానీ అతని మృదుస్వభావం, ఇతరుల కష్టాల్ని అర్థం చేసుకొనే గుణం వారిని మార్చాయి. షాపులో ఇదివరకటి ఉద్రిక్తత, టెన్షనూ ఇప్పుడు లేవు. ఆడుతూ పాడుతూ పనిచేస్తున్నట్టే ఉంది. సదా ఎవర్నీ దండించేవాడుకాదు, అధికారం చలాయించేవాడు కాదు. ఇక వారికి నచ్చకేం చేస్తాడు? కస్టమర్లు కూడా అతన్ని యజమానిగా అంగీకరించసాగేరు. సదా మాత్రం తను యజమాని అంటే ఛస్తే ఒప్పుకొనేవాడు కాదు. రఘుకాకా కొడుకూ, కోడలే అసలైన యజమాన్లనీ. వారి ఆజ్ఞల ప్రకారమే తను నడుచుకొంటున్నాననీ అనేవాడు. దాంతో ఏడుపుగొట్టువాళ్ల కళ్లు చల్లబడ్డాయి. సదా పని నల్లేరుమీద బండిలా సాగిపోయింది.

ఓరోజు కార్లో షాపుకొస్తుంటే తనను ఎస్సెల్సీ గట్టెక్కించిన బాల్యమిత్రుడు వినూ కనబడ్డాడు. కారెక్కించుకొని షాపుకి తీసుకొచ్చి అన్నీ చూపించేడు. వినూ ముగ్దుడైపోయాడు. ఇంత సిరి అబ్బినా సదా ఎప్పటిలాగానే ఉన్నందుకు మరీ సంతోషించేడు. ఆప్యాయంగా భుజం తట్టి, "సాధించావురా, సదా! నన్ను చూడు. చదువుసంధ్యలు వంట బట్టాయనుకో. కష్టపడి సంపాదించిందేమిట్రా అంటే ఓ ప్రభుత్వోద్యోగం! నువ్వు – కారూ, బంగళా, షాపు గుర్తుందా? నువ్వు చిన్నప్పుడు వీటిగురించే కలలు కనేవాడివి. అప్పుడివన్నీ అసంబద్ధంగా అనిపించి నవ్వుకొనేవాళ్లం. అసాధ్యమనుకొన్నవి సాధ్యం చేశావు. నువ్వు పైకి కనబడేదానికంటె ఎంతో గట్టివాడివిరా.

మెప్పుకి సదా కలవరపడిపోయాడు. చేతులు జోడించి, "నాకు లేనిపోని గొప్పలంటగట్టకురా బాబూ! ఇదంతా నా ప్రయోజకత్వం కాదు. ఏదో దేవుడు చల్లగా చూసేడు అంతే" అంటూ కళ్లు మూసుకొని ఒక్కసారి దేవుణ్ణి ధ్యానించాడు.

వినూ ఫక్కున నవ్వి, "చాల్లెవోయ్. ఈ వంకదణ్ణాలూ అవీ. ఇవన్నీ చూసి ఇక ఎవరూ మోసపోరు. ఎవరు పోయినా, పోకపోయినా నేను మాత్రం ఛస్తే మోసపోను. ఆ, అదీ! నీ విజయరహస్యం వినయంలో ఉంది. చిత్తం, చిత్తం అంటూనే అందర్నీ చిత్తు చేసేశావు" అంటూ భుజం చరిచేడు. ఈ

ఆరోపణలకి ఎలా ప్రతిస్పందించాలో తెలియక సదా ఎప్పటికంటే ఎక్కువగా కారులో మూలకి ఒదిగి కూచున్నాడు.

తర్వాత వినూ అనునయంగా, "సదా, నీకు కలిసొచ్చిన అదృష్టం గురించి గిల్టీగా ఫీలవ్వాల్సిన అవసరం లేదు. దేవుడిచ్చిన సౌఖ్యాల్ని హాయిగా అనుభవించు. అవునూ... బంగళా, కారులతోబాటు నీకు అరుణ ఫడ్కేని పెళ్లి చేసుకోవడం అనే ఇంకో కల కూడా ఉండేది కదూ. ఆమెకు పెళ్లయిపోయింది కాబట్టి, అలాంటి మరో తెలివైన, చదువుకున్న అందగత్తెను చూసి పెళ్లాడెయ్" అన్నాడు.

సదా భయంతో గడాగడా వణికాడు. "అటువంటి అమ్మాయిని సంభాలించుకోవడం నా వల్ల కాదు బాబూ. అంతకంటె బ్రహ్మచారిగా ఉండడమే మేలు" అన్నాడు. వినూ ఒకటే నవ్వు.

ఇంటికి తిరిగొచ్చేసరికి వాహిని తన కోసం కాచుకొని ఉండటం చూసి తబ్బిబ్బుపడ్డాడు సదా. "అయ్యయ్యో, నువ్వెందుకమ్మా వచ్చేవ్? కాకితో కబురంపిస్తే నేనే రెక్కలు కట్టుకొని వాలేవాణ్నిగా"

"నేనే స్వయంగా రావాల్సిన సందర్భం వచ్చింది. ఏం చెయ్యమంటారు" అంది వాహిని.

సదాకు గుండె దడదడలాడింది. "ఏవమ్మా! నావల్ల ఏదైనా లోటుపాట్లు జరిగితే చెప్పు దిద్దుకొంటాను..." అంటూ ఆరంభించేడు.

వాహిని నవ్వుతూ, "పెళ్లాం లేకపోవడం లోటేగా. మీరిన్నాళ్లూ పెళ్లి చేసుకోకుండా ఉండటం పొరపాటేగా" అంది.

సదా మనస్సు తేలికపడింది. "నాతో హాస్యాలాడుతున్నావామ్మా? రెండువందల జీతం, అతుకుల బొంత జీవితం. గంతకుతగ్గ బొంత అన్నట్టు ఎవరైనా నన్ను చేసుకొన్నా బొటాబొటీ ఆదాయంతో పిచ్చుకగూడులాటి ఇంట్లో కాపురం చేయలేక పారిపోయేది. పెళ్లి పెటాకులు చూడడానికి ఎవరైనా పెద్ద దిక్కు ఉండాలిగా. ఇక ఈ వయస్సులో పెళ్లి గురించి ఆలోచన కూడా అనవసరం"

వాహిని ఒప్పుకోలేదు. "మీ వంటి సాత్వికుడితో డబ్బున్నా, లేకపోయినా ఏ ఆడదైనా సుఖపడేది. సరే, ఇప్పటి సంగతేమిటి? పరిస్థితులు మారినా మీరు పెళ్లిమాట ఎత్తటం లేదు. కాబట్టి నేనే నడుం కట్టాను. చాలా సంబంధాలు వచ్చాయి. ఒకటి నాకు నచ్చింది. మీరూ ఒప్పుకోవాలి"

తనని వివాహితుడుగా ఊహించుకోవడానికి సదాకి ముచ్చెమటలు పోశాయి. భార్యలకి చాలా ఆశలుంటాయనీ, వారిని తృప్తిపరచడం కష్టమనీ అతనికి తెలుసు. "ఒద్దొద్దు" అంటూ అరిచేడు.

వాహిని అలిగినట్టు మొహం పెట్టి "నేను ఔనన్నది మీరు కాదంటున్నారన్నమాట. సరే లెండి, మీ ఇష్టం" అంది.

సదా బతిమాలేడు. "కాస్త నా మాట విను వాహినమ్మా, నేను బెండకాయలా ముదిరిపోయేను. కుర్రతనంలో కూడా నేను ఎన్నడూ నదురుగా, కంటికి నచ్చేట్టు లేను"

"ఎర్రగా, బుర్రగా ఉన్న మొగుడే కావాలని ప్రతీ ఆడదీ అనుకోదు. అర్థం చేసుకొనేవాడూ, అల్పసంతోషి అయిన భర్తయితే బాగుణ్ణని అనుకొనేవాళ్లూ ఉంటారని మీరు తెలుసుకోవడం మంచిది."

"నా వయస్సు సంగతి కాస్త ఆలోచించు"

"అది లెక్కలోకి తీసుకొనే చెప్తున్నాను. మీకు ముప్పై దాటాయి. ఆ అమ్మాయికి ముప్పై వస్తున్నాయి. అమ్మాయి చాలా బాగుంటుంది. చురుకైనదీ, బాగా చదువుకొన్నదీనూ"

"అమ్మ బాబోయ్! అంత ప్రతిభ గల అమ్మాయి అసలొద్దు. అలాటి అమ్మాయిని సుఖపెట్టడం నా వల్లకాదు."

"నిజానికి ఆ అమ్మాయి సంతోషిస్తుంది. మంచి తెలివైనవాడూ, అందగాడూకదాని ఓ కుర్రాణ్ణి పెళ్లాడిందామె. వాడు చూస్తే బరువూ, బాధ్యతా తీసుకోనివాడని తేలింది. వాడితో గడిపిన రోజులు తలుచుకొంటే ఇప్పటికీ వణికిపోతుంది. చివరికి విడాకులు తీసుకుంది"

సదాతోబాటు ఇంటికొచ్చి ఇప్పటిదాకా మౌనంగా ఉన్న వినూ నోరువిప్పేడు. "ఆమె డైవోర్సీనా, ఇప్పుడేం మరి"

వాహిని నచ్చచెప్పింది. "అవును. విడాకులు తీసుకొన్న మనిషే కానీ సదా బాబూ, మీకు భార్య కావలసిన వ్యక్తి తను. అందమైనదీ, సమర్థురాలూ, మీ వ్యాపార విషయాలు చూసుకోగలగడమే కాదు, అభివృద్ధి కూడా చేయగలదు. నిజానికి తను రుచిచూసిన చేదు అనుభవాల తర్వాత, పెళ్లి అంటే బెదురుతోంది. కానీ మీ పేరు తన దగ్గిర చెప్పగానే, మొహంలో వెలుగు కనపడింది. ఇంట్రెస్టు చూపించింది. మీ గురించి తనకు బాగా తెలుసు. మీకు ఒకప్పుడు తనంటే చాలా ఇష్టం కూడాట" ఆగింది వాహిని.

సదా ఆశ్చర్యపడ్డాడు, "ఎవరా అమ్మాయి, పేరేమిటి?"

"అరుణా ఫడ్కే" చిరునవ్వుతో సమాధానం చెప్పి సదా ఏమంటాడోనని చూసింది వాహిని.

ఏమంటాడు సదా? బుర్ర తిరిగి పోతూంటేను.

వాహిని కొనసాగించింది. "ఇంకో విషయం ఏమిటంటే అది మా పినతల్లి కూతురు. అదంటే నాకు చాలా ఇష్టం కూడాను"

తను ఈ సంబంధాన్ని కాదనలేదని సదాకు





అర్థమయిపోయేక వెర్రాడిలా తలాడిస్తూ కూచున్నాడు.

వినూ మాత్రం ఆనందం పట్టలేక బిగ్గరగా నవ్వుతూ సదా వీపు చరిచేడు.

●

(గంగాధర్ గాడ్గీళ్ మరాఠీరచనకు స్వేచ్ఛానువాదం
విపుల ఏప్రిల్ 1995 లో ప్రచురితం)